క్లుప్తంగా

వారపుసంతలో అన్నదానం



సంతలో భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో సోమవారం వ్యాపారులు, రైతులకు అన్నదానం చేశారు. వారపు సంతలో రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆకలితో ఉండకూడదనే అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు.

ఎస్వీయూ సీఐ బాధ్యతల స్వీకరణ



మురళీ మోహన్ రావు

తిరుపతి క్రైం: ఎస్వీ యూనివర్సిటీ సీఐగా మురళీ మోహన్ రావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన నంద్యాలలో సీఐగా పని చేస్తూ తిరుపతికి బదిలీ అయ్యారు. గతంలో ఈయన తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్‌లో సీఐగా పని చేశారు. శ్రీవారి పాదాల చెంత పనిచేయడం ఆనందంగా ఉందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.

జీఎస్టీ రద్దు చేయాలని ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

తిరుపతి అర్బన్: చేనేత కార్మికులు వినియోగిస్తున్న ముడిసరుకులపై విధించిన జీఎస్టీ రద్దు చేయాలని చేనేత కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

బీసీ సంక్షేమ సంఘంలో నియామకం



నియామక పత్రం అందుకుంటున్న సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడుగా ఈ.సుబ్రమణ్యం నాయుడుని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చేతుల మీదుగా సుబ్రమణ్యం నియామక పత్రం అందుకున్నారు. పాల ఏకరి సంఘం నేతగా ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ నియామకం చేయడంపై బీసీ సంక్షేమ సంఘ నేతలు జగదీష్, జ్ఞాన జగదీష్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పదవి కల్పించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రప్రభపై పరాశరేశ్వరస్వామి



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి సోమవారం సాయంత్రం చంద్రపభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య పూజా కైంకర్యాల అనంతరం 6 గంటలకు ఉత్సవమూర్తులు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరారు. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అధిరోహింపచేసి అష్టదిక్పాలను ఆహ్వానించారు. 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాలలో రెండో రోజు మంగళవారం సాయంత్రం సింహ వాహనంపై స్వామివారు విహరిస్తారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రేణిగుంట: వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. సోమవారం కరంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల ఉప ప్రణాళిక కింద వరిసాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రమ్ సీడర్ పద్ధతి, కేవీకే విధి విధానాలు, లోదుక్కులు, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, విత్తన శుద్ధి, సమగ్ర పంట యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వంద మంది రైతులకు ఆర్ఎన్ఆర్ 15048యు వరివిత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- స్పందన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించండి
- మేయర్ శిరీష, కమిషనర్ హరిత



ప్రజల నుంచి ఫిర్యాదును తీసుకుంటున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తుపాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.హరిత అన్నారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. గత వారం వచ్చిన స్పందన ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఏ మేరకు పరిష్కరించారు అన్నదానిపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చే మూడు రోజుల్లో తుపాను హెచ్చరికలను వాతావరణ శాఖ విడుదల చేసిందన్నారు. తుపాను ప్రభావం తిరుపతిపై ఉండే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో కాలువలను శుభ్రం చేసుకోవడం, మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా నగరం దాటి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా చెత్త నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ.. టౌన్ క్లబ్ వద్ద ఫ్లైఓవర్ కోసం స్థలం వదిలినందుకు ఆ స్థలానికి టీడీఆర్ బాండ్లు అందించాలన్నారు. మజ్జిగ కాలువ వద్ద నుంచి అవిలాల వైపు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసేందుకు పరిశీలించి చర్యలు చేపడతామని కమిషనర్ హరిత అన్నారు. 22, 23, 24, 25, 26 వార్డుల్లోని ప్రజలకు అనుకూలంగా ఉండేలా బాలాజీ కాలనీలోని శ్మశానవాటికలో కర్మక్రియలకు వంద అంకణాలు కేటాయించాలని కార్పొరేటర్ నరసింహాచారి కమిషనర్‌ను కోరారు. అలానే కట్టకిందపల్లె శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారని, ప్రహరి గోడ నిర్మించాలని, బోరు మరమ్మతులు చేయించాలని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. అలిపిరి దగ్గర దుకాణదారులు రోడ్డును ఆక్రమించడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, శ్రీనివాసం దగ్గర రోడ్డును తవ్వి తిరిగి పూడ్చలేదని, పోస్ట్ ఆఫీస్ వద్ద మ్యాన్ హోల్‌కి మూత ఏర్పాటు చేయాలని ఫిర్యాదులు అందాయి. పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, రెవెన్యూ అధికారులు కేఎల్.వర్మ, సేతుమాధవ్, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మహేష్, నరేంద్ర, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాలలో యోగాపై అవగాహన

తిరుపతి తుడా: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజుల అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి విద్యార్థులతో చేయించారు. యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత సాధ్యమని, ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుందరం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు లక్ష్మీ నారాయణ, ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఆయుర్వేద కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్ర కిషోర్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ముస్తాక్ అహ్మద్, విజయశ్రీ పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు సహకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు సామాజిక బాధ్యతగా పరిశ్రమల యాజమాన్యం సహకరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 100 సంక్షేమ వసతి గృహాల్లో వర్షపు నీటి లీకేజీలతోపాటు మురుగు కాలువల సమస్యలు ఉన్నాయని తెలిపారు. 17 హాస్టళ్లలో అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సి ఉందని, అందుకు రూ.86 లక్షల ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారని వెల్లడించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు శాఖ అధికారులు చెన్నయ్య, భాస్కర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూములను సర్వే చేయండి సార్



జేసీ బాలాజీతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి శెట్టిపల్లి భూముల్లో జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశామని, సర్వే చేపట్టాలని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీని కలిశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా కొనసాగుతున్న శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అనేక పేద కుటుంబాలకు చెందిన వారు సమస్య పరిష్కారం కోసం ఎదురుచుస్తున్నారని వివరించారు. తప్పకుండా సర్వేను ప్రారంభిస్తామని, అందరికి న్యాయం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ వారికి తెలిపారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, రూయా ఆస్పత్రి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్, సప్తగిరి రాజు, సురేష్‌యాదవ్ ఉన్నారు.



శివకుమార్‌ని అభినందిస్తున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి

శివకుమార్‌కు అభినందనలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శివకుమార్ సేవలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి కొనియాడారు. శివకుమార్‌కు ఫెలో రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (యూకే)లో సభ్యత్వం లభించిన నేపథ్యంలో సోమవారం ఎస్వీయూ వీసీ చాంబర్‌లో రాజారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వీసీ శివకుమార్‌ను అభినందించారు. శివకుమార్ కెమిస్ట్రీ విభాగంలో పలు అంశాలపై విపులంగా పుస్తకాలు, పేపర్లను రచించి ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఆయన చేసిన కృషిని గుర్తించి ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో సభ్యత్వం లభించడం గర్వించదగ్గ విషయమన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పిరమళై కల్లర్ కులం గుర్తింపునకు వినతి



మంత్రి పెద్దిరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని పిరమళై కల్లర్ కులస్తులకు గుర్తింపు కల్పించి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని పిరమళై కల్లర్ తేవర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా 15 నుంచి 20 వేల మంది జనాభా ఉన్న తమ కులస్తులు మూడు తరాలుగా గుర్తింపునకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని కోరారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సౌందర్‌రాజ్, నాయకులు బాలు, సెంథిల్, శేఖర్, సతీష్, శ్రీనివాస్, స్వామి, కాసిమాయన్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ ఉన్నారు.

విద్యార్థులకు సత్కారం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం నరసింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యురాలు అశ్విని ప్రవీణ్ కుమార్, సర్పంచ్ చెంచురత్నం సత్కరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎంపీటీసీ అశ్విని రూ.2 వేలు, సర్పంచ్ చెంచురత్నం రూ.1000 చొప్పున నగదు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరసింగాపురం ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తి, ఉపాధ్యాయులు భాను, దేవ, కేశవులు రెడ్డి, కొండయ్య, లతాదేవి, అమరావతి పాల్గొన్నారు.

అలరించిన బకాసుర బండి కుంభం



భీమ, బకాసుర పాత్రధారులు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం బకాసుర బండి ఘట్టం ప్రేక్షకులను అలరించింది. భీమునిగా నవీన్‌కుమార్ రెడ్డి, బకాసురునిగా తారకరాములు అద్భుత ప్రదర్శన చేశారు. భాగవతారిణి నాగరత్న హరికథ గానం చేశారు. భక్తులకు శ్రీబ్రహ్మర్షి గురూజీ ఆశ్రమ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

టెన్త్ టాపర్స్‌కు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందిస్తున్న హెచ్ఎం

రామచంద్రాపురం: జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా పదో తరగతి పరీక్షల్లో పాఠశాల టాపర్లకు సోమవారం ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ.. మండలంలోని 9 పాఠశాలల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన 28 మంది విద్యార్థులకు రూ. 57,000తో పాటు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుజనకుమారి, తులసి కుమారి, వాగ్దేవి, శంకరి, భాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సదా మహాలక్ష్మి మృతికి ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: తిరుపతి ఎంఆర్‌పల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు యోగా శ్రీనివాస్ సతీమణి సదా మహాలక్ష్మి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. యోగా శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు డిష్ చంద్ర, మాకం చంద్ర, అనీల్, కరాటే శీను, కిరణ్, జస్టిన్‌రాజు, ఆనంద్ ఉన్నారు.

బీజేపీకి నాగరాజ రాయల్ రాజీనామా



మాట్లాడుతున్న గుట్టా నాగరాజ రాయల్

తిరుపతి కల్చరల్: బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత గుట్టా నాగరాజ రాయల్ ప్రకటించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు దయాకర్‌రెడ్డికి రాజీనామా పత్రం పంపినట్లు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో బీజేపీలో కార్యకర్తల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కార్యకర్తలతో సంబంధం లేకుండా నాయకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. పార్టీ కోసం ఎంత కష్టపడినా ఫలితం, గుర్తింపు లేదని.. ఈ క్రమంలో తనతో పాటు మరో ఐదుగురు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. బీజేపీ నేతలు దండు ప్రభాకర్, సుధీర్, కిషోర్, రామగోపి, శంకర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



పనపాకంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- పరీక్షలకు విచ్చేసే ప్రజలకు ఉచిత భోజన సదుపాయం
- పనపాకంలో వైద్య శిబిరాన్ని పరిశీలించిన మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండలంలోని పనపాకం పంచాయతీ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యకర జీవితాన్ని అనుభవించాలని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పనపాకం హైస్కూల్, అరిగిలవారిపల్లి ప్రాథమిక పాఠశాల, రవణప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా ఆరోగ్య పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వీటిని సోమవారం పనపాకంలో మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసుకునేందుకు విచ్చేసిన ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన సదుపాయాలు కల్పించారు. ప్రజలు కూడా ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చి మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని అనుభవించాలనే ఆకాంక్షతో వైద్య శిబిరం ఏర్పాట్లకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, వైఎస్ఆర్సీపీ నాయకులు వరలక్ష్మి, గౌరి, కరుణకుమార్, చెంగల్రాయులు, మునిరాజ, రెడ్డెప్ప, మాతయ్య, నాగభూషణం, ఢిల్లీశ్వర్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నిడదవోలు ఎమ్మెల్యే

తిరుమల: తిరుమల శ్రీవారిని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసులు నాయుడు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు

- డీఎల్‌పీఓ రూపారాణి



నరసింగాపురంలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ రూపారాణి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఈ నెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని.. ఇందులో భాగంగా ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయాలని తిరుపతి డివిజనల్ పంచాయతీ అధికారి రూపారాణి అన్నారు. చంద్రగిరి మండలం నరసింగాపురం సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు అవుతున్న జగనన్న భూ రక్ష, భూ హక్కు సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. డ్రోన్ కెమెరా ద్వారా చేస్తున్న సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతి విద్యుత్ పోల్‌కు లైట్లు అమర్చాలని, గ్రామ శివారుల్లో చెత్త కుప్పలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్షిత పథకం కింద సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.

పుస్తక పఠనంతో మేధా సంపత్తి వృద్ధి

తిరుపతి ఎడ్యుకేషన్: పుస్తక పఠనంతో మేధా సంపత్తి వృద్ధి చెందుతుందని, పుస్తక పఠనాన్ని విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలని ఎస్వీ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వై.గంగాధర్‌రావు అన్నారు. జాతీయ పఠన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కళాశాల గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పఠనం ద్వారా జ్ఞానం, పద సంపద పెరుగుతుందని, మనుషుల వ్యక్తిత్వాలు, సమాజం, వివిధ అంశాలపై అవగాహన వస్తుందన్నారు. అందుకే పుస్తక పఠనం ద్వారా జీవితాన్ని బాగా అర్థం చేసుకోగలమన్నారు. ఏ గ్రూప్ విద్యార్థి అయినా అన్ని శాస్త్రాలపైన ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని, అది కేవలం పుస్తక పఠనం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ జి.శిరీష మాట్లాడుతూ.. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో పుస్తకాలు చదవాలన్న ఆసక్తి సన్నగిల్లుతోందని, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. హాస్టల్ వార్డెన్ డాక్టర్ సి.వాసుదేవులు నాయుడు మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో నైపుణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, అధ్యాపకులు పి.ధనమ్మ, సోమశేఖర్, పి.రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి పోరు కేక మహా పాదయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి కల్చరల్: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరు కేక మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సీపీఎం కార్యాలయంలో పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో పరివాహక ప్రాంతంలో ముంపునకు గురవుతున్న గిరిజనులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నెల్లపాక నుంచి విజయవాడ వరకు 400 కిలోమీటర్లు పోరు కేక మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. చివరిగా విజయవాడలో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు కందారపు మురళి, ఎస్.జయచంద్ర, సుబ్రమణ్యం, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

క్షుద్రపూజల పేరుతో మహిళలకు ట్రాప్

- తిరుపతికి చెందిన మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి
- ఏడుగురు ముఠా సభ్యుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం: బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు పెళ్లి కాని ఆడపిల్లలకు త్వరగా పెళ్లిళ్లు అవుతాయని, ఆరోగ్య సమస్యలున్నా పూర్తిగా నయం అవుతాయంటూ ఓ గ్యాంగ్ మహిళలను మోసగిస్తోంది. ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని ట్రాప్ చేస్తోంది. అయితే తిరుపతికి చెందిన ఒక మహిళ ఈ ముఠా సభ్యుల చేతిలో మోసపోయింది. ఆమె ఫిర్యాదుతో బాబా అండ్ కో చేస్తున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి. గ్యాంగ్‌లోని ఏడుగురిని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణ కుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఒక మహిళ ఆర్థిక సమస్యలతో బాధపడేది. తన కుమార్తెలకు వయసు వచ్చినా ఇంకా పెళ్లిళ్లు కాలేదు. ఈ క్రమంలో ఓ బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబంలోని ఇతర సమస్యలు కూడా పూర్తిగా తీరిపోతాయని ఒక మహిళ ద్వారా తెలుసుకున్న ఆమె ముఠా సభ్యులను ఆశ్రయించింది. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరులో సమావేశమైంది. పూజలు చేస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు ఆమెను లైంగికంగా వేధింపులకు గురి చేశారు. దీంతో వారి బారి నుంచి తప్పించుకుంది. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు నిందితుల అరెస్ట్

నిందితులు అమృతానగర్‌లో ఉన్నారని తెలియడంతో సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్ దాడులు నిర్వహించారు. అనంతపురం జిల్లాకు చెందిన వసారింటి నాగరాజు, కంబగిరి రాముడు, వడ్డే వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన మార్కె కంబగిరి రాముడు, మొట్టే కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన జిట్టా రవికుమార్, తిరుపతికి చెందిన పాలిచెర్ల ప్రియలను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు బాబా, మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం..

ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళలను ఈ గ్యాంగ్ టార్గెట్ చేస్తోంది. గ్యాంగ్‌లోని మహిళలను ఏజెంట్లుగా ఉపయోగించుకుంటున్నారు. వారి ద్వారానే అమాయక మహిళలను ట్రాప్ చేస్తున్నారు. కుద్ర పూజలకు అంగీకరించిన మహిళలను లొంగదీసుకుని వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిపై లోతుగా విచారణ చేస్తున్నారు.